
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 జనగామ

బుధవారం 4 జూన్ 2025


కొలాప్స్



పాలకుర్తి మండలం మల్లంపల్లి పాఠశాలలో నిర్వహించిన మరమ్మతు పనులు (ఫైల్)

- పాఠశాలలు, పీహెచ్‌సీలు, అంగన్‌వాడీల్లో ఫ్లడ్ డ్యామేజీ పనులు
- మార్చిలోనే పనులు పూర్తి..
- సకాలంలో బిల్లులు సమర్పించని అధికారులు
- జిల్లాలో రూ. 1.74 కోట్ల బిల్లులు పెండింగ్
- నిధులు వెనక్కి మళ్లినట్టు ప్రచారం
- లబోదిబోమంటున్న గ్రామైక్య సంఘాల (వీవో) అధ్యక్షురాళ్లు
- అధికారుల చుట్టూ బాధితుల ప్రదక్షిణలు

అధికారుల నిర్లక్ష్యంతో నిధులు వెనక్కి



జనగామ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా అధికారుల అలసత్వం గ్రామైక్య సంఘాల(వీవో) అధ్యక్షురాళ్లకు శాపంగా మారింది. పంచాయతీరాజ్, ఇరిగేషన్, టీజీఈడబ్ల్యూఐడీసీ శాఖల నిర్లక్ష్యంతో నిధులు వెనక్కి వెల్లడంతో వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా పలు పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ ఏడాది మార్చిలో ఫ్లడ్ డ్యామేజీ (వరద నష్ట) పనులు నిర్వహించారు. గత ఏడాది కురిసిన వర్షాలతో దెబ్బతిన్న పాఠశాలలు, పీహెచ్‌సీలు, అంగన్‌వాడీ కేంద్రాలను మరమ్మతు పనులు చేపట్టేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. దానికి సంబంధించిన నిధులను కూడా విడుదల చేసింది. జిల్లాలో దెబ్బతిన్న స్కూళ్లు, పీహెచ్‌సీలు, అంగన్‌వాడీ సెంటర్లను గుర్తించి అధికారులు ప్రతిపాదనలు పంపారు. స్కూళ్లు, పీహెచ్‌సీ మరమ్మతులకు రూ. 2లక్షలు, అంగన్‌వాడీ కేంద్రాలకు రూ2.50లక్షల చొప్పున నిధులను ప్రభుత్వం కేటాయించింది. సకాలంలోనే బిల్లులు వస్తాయని ఆయా శాఖల అధికారులు పనులు అప్పగించిన సమయంలో చెప్పడంతో అప్పుతెచ్చి మరీ పనులు పూర్తి చేశారు. తీరా నిధులు వెనక్కి వెళ్లాయని తెలిసి అధికారులు తీరుపై మండిపడుతున్నారు.

వీవో అధ్యక్షులకు పనులు బాధ్యతలు

గ్రామాల్లోని స్కూళ్లలో పాఠశాల యాజమాన్య కమిటీలు, సర్పంచులు, ఎంపీటీసీలు లేకపోవడంతో అమ్మ ఆదర్శ కమిటీలకు చైర్మన్లుగా వ్యవహరిస్తున్న గ్రామైక్య సంఘాల(వీవో) అధ్యక్షురాళ్లకు మరమ్మతు పనుల బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. ఈ పనులకు సంబంధించి ఉత్తర్వులు ఇస్తూనే మార్చి 31లోగా పనులకు సంబంధించిన బిల్లులు వస్తాయని అధికారులు చెప్పారు. దీంతో ఆయా పాఠశాలల్లో మరమ్మతు పనులను బాధ్యతలను వీవో అధ్యక్షురాళ్లు భుజానికెత్తుకున్నారు. సొంత డబ్బులకు తోడు, వడ్డీకి తెచ్చి స్కూళ్లలో, పీహెచ్‌సీల్లో, అంగన్‌వాడీ కేంద్రాలలో బాత్‌రూమ్ రిపేర్, వాటర్ సప్లై పనులు, మొరం పోయించడం, గేట్ల రిపేర్, బిల్డింగ్ పైన ఫ్లోరింగ్ చేయించడం, ఎలక్ట్రికల్ పనులు చేపట్టారు.

నిర్లక్ష్యంతో నిధులు వెనక్కి..

వరద నష్టం (ఫ్లడ్ డ్యామేజీ) కింద చేపట్టిన పనులకు సంబంధించి బిల్లులను విడుదల చేయించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు బాధితులు వాపోతున్నారు. మార్చి 31లోగా బిల్లులు వస్తాయని చెప్పడంతో పనులు సకాలంలో పూర్తి చేశారు. ఈ పనులు పూర్తయి మూడు నెలలు అవుతున్నా ఇంత వరకూ బిల్లులు రాలేదు. కాగా.. జిల్లాలో చేపట్టిన పనుల్లో చేపట్టిన పనులకు సంబంధించి బిల్లులను అధికారులు

మిగతా 8వ పేజీలో...

రూ.1.74 కోట్లు పెండింగ్

ఫ్లడ్ డ్యామేజీ కింద జిల్లావ్యాప్తంగా 42 స్కూళ్లు, 15 పీహెచ్‌సీలు, 24 అంగన్‌వాడీ కేంద్రాల్లో పనులు నిర్వహించారు. ఈ పనులను పర్యవేక్షణ బాధ్యతలను పంచాయతీరాజ్, ఇరిగేషన్, టీజీఈడబ్ల్యూఐడీసీకి అప్పగించారు. ఈ ఏజెన్సీలు పనులను పర్యవేక్షించి రికార్డు చేసి ట్రెజరీకి పంపాల్సి ఉంటుంది. కానీ.. ఆయా ఏజెన్సీలు, ఆయా శాఖల సంయుక్త నిర్లక్ష్యం కారణంగా మార్చి 31లోగా పూర్తయిన పనులకు కూడా బిల్లులు రాలేదు. జిల్లావ్యాప్తంగా 81 పనులకు గానూ రూ.1.74 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

ఏవోకు వినతి..

ఫ్లడ్ డ్యామేజీ కింద చేపట్టిన బిల్లులు ఇవ్వాలని కోరుతూ పాలకుర్తి మండలానికి చెందిన పలువురు వీవో అధ్యక్షురాళ్లు కలెక్టరేట్ ఏవో మన్సూరికి మంగళవారం వినతిపత్రం అందించారు. మార్చి 31లోగా డబ్బులు వస్తాయంటూ పనులు చేశా మని, కానీ ఇంతవరకూ రావడం లేదని వాపోయారు. వడ్డీకి తెచ్చి పనులు చేశామని, అధికారులు స్పందించి త్వరితగతిన బిల్లులు మంజూరు చేయిం చాలని పాలకుర్తి మండలం వావిలాల, మల్లంపల్లి, గూడూరు పాఠశాలల్లో పనులు చేసిన పుష్పలత, స్వప్న, విజయ్‌కుమార్, ఆర్.యాకయ్య, కిరణ్ కోరారు.



కలెక్టరేట్ ఏవో మన్సూరికి వినతిపత్రం ఇస్తున్న బాధితులు

భూభారతి చట్టంతో భూ సమస్యలు పరిష్కారం

- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



నాగారంలో దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్

జనగామ రూరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): భూ భారతి చట్టంతో భూ సమస్యలు త్వరగా పరిష్కారం పొందుతాయని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా స్పష్టం చేశారు. పెంబర్తిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సును మంగళవారం కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 20 వరకు రెండో విడత రెవెన్యూ సదస్సులు జరుగుతాయన్నారు. భూ రికార్డుల్లో పేరు తప్పులు, విస్తీర్ణం హెచ్చుతగ్గులు, వారసత్వ భూములు, భూ స్వభావం తప్పులు, నిషేధిత జాబితాలో ఉన్న భూ సమస్యలు, సర్వే నంబర్ మిస్సింగ్, పట్టా పాసు బుక్ లేకపోవడం, ప్రభుత్వ భూములను నవీకరించడం, సాదాబైనామా కేసులు తదితర భూ సమస్యలకు సదస్సు ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు.

● లింగాలఘణపురం(ఆంధ్రజ్యోతి): భూభారతి చట్టంతో భూసమస్యలు త్వరగా పరిష్కారమవుతాయని కలెక్టర్ పేర్కొన్నారు. మంగళవారం నాగారంలో జరిగిన రెవెన్యూ సదస్సులో కలెక్టర్ మాట్లాడుతూ అపరిష్కృత భూసమస్యలను త్వరితగతిన పరిష్కరించి రైతులకు భూహక్కులను కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈనెల 3నుంచి 20 వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని రెవిన్యూ గ్రామాల్లో నిర్వహించడం జరుగుతుందన్నారు. అయితే దరఖాస్తులు తీసుకున్న తర్వాత అధికారులు క్షేత్రస్థాయి విచారణ చేపట్టి సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. దరఖాస్తుదారులకు కచ్చితంగా రశీదు ఇవ్వాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ రవీందర్, ఆర్ఐ కిశోర్ రెవెన్యూ సిబ్బంది ఉన్నారు. అంతకు ముందు జనగామ ఆర్డీవో గోపీరామ్ నాగారం రెవెన్యూ సదస్సును సందర్శించి అధికారులకు పలు సూచనలు సలహాలు అందజేశారు.

బెస్ట్ ప్రాక్టీస్ రాష్ట్ర సదస్సుకు జిల్లా నుంచి ఐదు స్కూళ్లు

జనగామ కల్చరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను ఆకట్టుకునేందుకు ఉపాధ్యాయులు వినూత్నమైన బోధనా పద్ధతులను (బెస్ట్ ప్రాక్టీస్) ఎంచుకుంటారు. అలాంటి వారికి ఈనెల 4న ఎస్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో హైద్రాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో రాష్ట్ర సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో ఎంపిక చేసిన స్కూళ్ల నుంచి ఉపాధ్యాయులు తమ విధానాలను ప్రదర్శించనున్నారు. జనగామ జిల్లా నుంచి ఐదు స్కూళ్లు ఈ సదస్సులో పాల్గొననున్నాయి. కె.శిరీష, టీజీటీ మ్యాథ్స్ (టీఎస్ఎంఎస్, కొడకండ్ల), డి.వెంకటేశ్వర్లు, ఎస్ఏ సోషల్ (జెడ్పీహెచ్ఎస్ చిల్పూరు), ఎన్.జయపాల్‌రెడ్డి, ఎస్‌జీటీ (పీఎస్ భాంజీపేట), బి.వెంకన్న, ఎస్‌జీటీ(పీఎస్ పెద్దమడూరు), ఆర్.రామ్మోహన్‌రెడ్డి, ఎస్‌జీటీ (పీఎస్ మాన్‌సింగ్ తండా) ఉపాధ్యాయులు సదస్సులో తమ విధానాలను ప్రదర్శిస్తారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు షురూ

జనగామ కల్చరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్రంలోని ధర్మకంచ జిల్లా పరిష త్ ఉన్నత పాఠశాలలో ఒకే పరీక్షకేంద్రాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థులకు తెలుగు పరీక్ష నిర్వహించారు. 51 మంది విద్యార్థులకు గాను 48 మంది విద్యార్థులతో 94.11% విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాన్ని డీఈవో డి.భోజన్న సందర్శించారు. ఆయన వెంట ఏసీజీఈ రవికుమార్ ఉన్నారు.

పాఠశాలల్లో ఫిర్యాదు బాక్స్‌లు

- జిల్లా విద్యాశాఖాధికారి ఉత్తర్వుల జారీ

లింగాలఘణపురం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): 'మధ్యాహ్న భోజనం' నాణ్యతాప్రమాణాలు, నిర్వహణా తీరుపై విద్యార్థులు ఎప్పటికప్పుడు ఫిర్యాదు చేసేందుకు వీలుగా కంప్లెయింట్ బాక్స్‌లను వెంటనే ఏర్పాటు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి భోజన్న మంగళవారం ఉత్తర్వులను జారీ చేశారు. తెలంగాణ ఫుడ్ కమిషన్ సెక్రెటరీ జిల్లా విద్యాశాఖకు చేసిన సిఫార్సుల మేరకు జిల్లా విద్యాశాఖ ఈ నిర్ణయం తీసుకుంది. అలాగే పాఠశాలల్లో జిల్లాస్థాయి అధికారుల పేర్లతో కూడిన బోర్డును కూడా ఏర్పాటు చేయాలని ఎంఈవోలు, హెడ్మాష్టర్లను డీఈవో ఆదేశిస్తూ ప్రొసీడింగ్ జారీ చేశారు.

పైపులైన్‌కు మరమ్మతు

- 'జియో' తవ్వకాలతో పగిలిన పైపులైన్
- నాలుగు రోజుల నుంచి నిలిచిన భగీరథ నీళ్లు



12 అడుగులు లోతులో మరమ్మతు చేస్తున్న కార్మికుడు

స్టేషన్‌ఘన్‌పూర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జియో ఫైబర్ కేబుల్‌ను కోసం భూమిలోపల స్టేషన్‌ఘన్‌పూర్‌లో మిషన్‌తో తవ్వకాలు జరుపుతుండగా విద్యాజ్యోతి డిగ్రీ కళాశాల సమీపంలో మిషన్ భగీరథ మెయిన్ పై పులైన్ దెబ్బతినగా మరమ్మతు చేయడానికి సిబ్బంది మంగళవారం సాహసాలు చేయాల్సి వచ్చింది. ఘన్ పూర్, శివునిపల్లి, పాంనూర్, నెమలిగొండ, తానేధార్‌పల్లి, ఇప్పగూడెం, సముద్రాల గ్రామాలకు తాగునీరు అందించే ప్రధాన పైపులైన్‌కు నాలుగు రోజుల క్రితం రంధ్రం పడి నీళ్లు పెద్దఎత్తున ఉబికిరావడంతో మిషన్ భగీరథ అధికారులు నీటి సరఫరాను నిలిపివేశారు. రంధ్రాన్ని గుర్తించడానికి తీవ్రంగా శ్రమించి, హైవే పనుల్లో భాగంగా సర్వీసు రోడ్డు పక్కన ఏర్పాటు చేసి న ఆరు అడుగుల డ్రైనేజీ కింద నుంచి పైపులైన్ పగిలినట్టు గుర్తించారు. వ్యక్తిదూరేలా 12అడుగుల గొయ్యి తవ్వి లోపలికి మరమ్మతు పనులు చేశారు. అనంతరం అధికారులు పైపులైన్ ద్వారా సోమవారం నీళ్లను పంపించగా లీక్ అయ్యాయి. దీంతో మంగళవారం మరోసారి మరమ్మతు చేయాల్సి వచ్చింది. మిషన్ భగీరథ ఈఈ రాజయ్య, డీఈ సూర్యల పర్యవేక్షణలో ఏఈ ప్రశాంత్ ఆధ్వర్యంలో మరమ్మతు పనులకు నాలుగు రోజుల శ్రమించాల్సి వచ్చింది.

ఇందిరమ్మ రాజ్యంలోనే పేదలకు న్యాయం

ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



లబ్ధిదారులకు మంజూరి పత్రాలను అందచేస్తున్న ఎమ్మెల్యే

పాలకుర్తి, జూన్ 3(ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ రాజ్యంలోనే పేదలకు అన్నిలా న్యాయం జరుగుతుందని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి పేదవాడికి అందేలా పనిచేస్తానని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ దశల వారీగా ఇళ్లు మంజూరి చేసి నిర్మిస్తామన్నారు. రెండో విడత అర్హులకు కూడా మంజూరి చేస్తామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. భూసమస్యలు పరిష్కరించేందుకు భూభారతి ద్వారా అన్ని రెవెన్యూ గ్రామాల్లో సదస్సులను నిర్వహిస్తోందన్నారు. సమావేశంలో మార్కెట్ చైర్మన్ లావుడ్యా మంజుల, ఎంపీడీవో ఆవుల రాములు, ఎంపీవో రవీందర్, నాయకులు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, మాజీ సర్పంచు యాకాంతరావు, మాజీ మార్కెట్ చైర్మన్ రాఘవరావు, గాదెపాక భాస్కర్, జల్గం కుమార్, గోనె మహేందర్, ఎండి మదార్ తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ ఇళ్లు : ఆర్డీవో



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో

జఫర్‌గడ్, జూన్ 3(ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందని స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో డీఎస్.వెంకన్ననాయక్ అన్నారు. ఇందిరమ్మ ఇళ్లపై మంగళవారం జఫర్‌గడ్ మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, జీపీ కార్యదర్శులచే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ ఇళ్లు లేని పేదలందరికీ దశల వారీగా ప్రభుత్వం ఇళ్లను మంజూరు చేస్తుందన్నారు. తొలి విడతగా మండలంలోని ఆయా గ్రామాల్లో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల పత్రాలను జఫర్‌గడ్‌లో 5న ఎమ్మెల్యే కడియం శ్రీహరి పంపిణీ చేస్తారన్నారు. సమావేశంలో గృహనిర్మాణ శాఖ పీడీ మాతృనాయక్, తహసీల్దార్ శంకరయ్య, ఎంపీడీవో సుమన్, వైద్యాధికారులు రాజమౌళి, భారతి, డీటీ అనిల్‌కుమార్, ఏపీవో రాజకరుణ, ఏపీఎం రవిందర్ తదితరులు పాల్గొన్నారు.

చరవాణిలో వాతావరణం

● యాప్‌ల ద్వారా రైతులకు ఉపయోగం - 7లో..

సంపద పెరిగితే ఆకలిచావులు ఎందుకు?

- ప్రజాధనం కార్పొరేట్‌కు కేంద్రం ధారాదత్తం
- పెట్టుబడిదారులకు కమ్యూనిస్టులే ప్రత్యామ్నాయం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు
- నర్మెటలో సీపీఐ జిల్లా నాల్గవ మహాసభలు

7



నర్మెటలో ప్రజా ప్రదర్శన నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు



టూ-డే క్రికెట్ లీగ్ పోటీలకు ఎంపికైన ఉమ్మడి వరంగల్ జిల్లా క్రికెట్ జట్టుతో నిర్వాహకులు

అండర్-25 టూ-డే క్రికెట్ లీగ్ జిల్లా జట్టు ఎంపిక

వరంగల్ స్పోర్ట్స్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో జూన్ నెల 2వారం నుంచి హైదరాబాద్‌లో నిర్వహించనున్న అండర్-25 బాలుర టూ-డే క్రికెట్ లీగ్ పోటీల్లో పాల్గొననున్న ఉమ్మడి వరంగల్ జిల్లా క్రికెట్ జట్టును మంగళవారం ఎంపిక చేసినట్లు వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత నెల 19 నుంచి జూన్ 2వ తేదీ వరకు హనుమకొండ, వరంగల్, భూపాలపల్లి, ములుగు మహబూబాబాద్, జనగామ జిల్లాల జట్ల మధ్య రెడ్డిపురం, మొగిలిచర్ల, వంగపల్లి క్రికెట్ క్రీడా మైదానాల్లో అంతర్ జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించామని శ్రీనివాస్ అన్నారు. సుమారు 15 రోజుల పాటు ఆరు జిల్లాల మధ్య ఒక్కో జట్టుకు 5మ్యాచ్‌లు నిర్వహించి, బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 19 మంది క్రీడాకారులను టూ-డే క్రికెట్ లీగ్ పోటీలకు ఎంపిక చేశామన్నారు. హెచ్‌సీఏ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో టూ-డే క్రికెట్ లీగ్ వారానికి ఒక్కో జిల్లాకు ఒక్కో మ్యాచ్‌ని నిర్వహించనున్నట్లు శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సెలక్షన్ కమిటీ చైర్మన్ డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్‌గౌడ్, కోచ్‌లు ఎం.డి. అఫ్జల్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైన జిల్లా జట్టు : బి.వరుణ్ (కెప్టెన్), కె.రోహిత్‌రెడ్డి, ఎం.శివరామ్, ఎస్.రాహుల్, ఎ.లక్ష్మణ్, ఎం.దేవేందర్, పి.రిశ్వంత్, ఎం.రామ్‌చరణ్, ఎస్.ఆదర్శ్, ఎం.రోహిత్, వి.వైష్ణవ్, జె.పార్థిపన్, డి.మనోజ్, బి.మణిదీప్‌సింగ్, ఎం.రాణాచరణ్, నితిన్‌పటేల్, పి.సంతోష్, బి.సతీష్, పూజిత్.

మెడికల్ కాలేజీ హాస్టల్‌లో పాము

పట్టి అడవిలో వదిలిన స్నేక్ క్యాచర్ ఇమామ్

మహబూబాబాద్ క్రైం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల బాలుర వసతి గృహంలో సోమవారం రాత్రి నాగు పాము కలకలం రేపింది. హాస్టల్ ఆవరణలో నాగు పాము సంచారాన్ని గమనించిన విద్యార్థులు భయంతో పరుగులు తీసి, కళాశాల ప్రిన్సిపాల్ లకావత్ వెంకట్‌కు సమాచారం అందించారు. వెంటనే అటవీశాఖ జిల్లా అధికారికి సమాచారం అందించగా, బీట్ ఆఫీసర్ రవీందర్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. బీట్ ఆఫీసర్ సహాయంతో స్నేక్ క్యాచర్ ఇమామ్ నాగుపామును పట్టుకొని, అడవిలో వదిలివేయడంతో విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు. మెడికల్ కళాశాల హాస్టల్ ప్రాంగణంలో పిచ్చిచెట్లు, చెత్తాచెదారం పేరుకుపోయి పాములు, తేళ్లు హాస్టల్ భవనంలోనికి ప్రవేశించి ఏ క్షణంలో ప్రమాదం సంభవిస్తుందోనని విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని మెడికల్ కళాశాల హాస్టల్ ప్రాంగణంలో చెత్తాచెదారం తొలగించాలని విద్యార్థులు కోరుతున్నారు.



మహబూబాబాద్ మెడికల్ కళాశాలలో నాగుపామును పట్టుకుంటున్న స్నేక్ క్యాచర్

రాయపర్తి ఎస్సైగా ఎస్.రాజేందర్

వరంగల్ క్రైం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వెస్ట్‌జోన్ పరిధిలోని రాయపర్తి ఎస్సైగా సీసీఆర్‌బీలో పనిచేస్తున్న ఎస్.రాజేందర్‌ను నియమిస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, ఇక్కడ ఇంతకాలం విధులు నిర్వర్తించిన శ్రవణ్‌కుమార్‌ను వీఆర్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

6న ఎస్సార్‌యూ 3వ స్నాతకోత్సవం

● ప్రముఖ సంగీత దర్శకుడు కీరవాణికి గౌరవ డాక్టరేట్ ● వివరాలను వెల్లడించిన వైస్ చాన్స్‌లర్ దీపక్‌గార్గ్

హసన్‌పర్తి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతసాగర్ ఎస్సార్ విశ్వవిద్యాలయం 3వ స్నాతకోత్సవ వేడుకలు జూన్ 6వ తేదీన నిర్వహిస్తున్నట్లు విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ దీపక్ గార్గ్ వెల్లడించారు. మంగళవారం అనంతసాగర్ ఎస్సార్ విశ్వవిద్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. జూన్ 6వ తేదీ శుక్రవారం ఎస్సార్ యూనివర్సిటీ ప్రాంగణంలో జరిగే 3వ స్నాతకోత్సవ వేడుకలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్ గౌరవ సలహాదారు (క్యాబినెట్ ర్యాంక్), ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ జి.సతీష్‌రెడ్డి ముఖ్య అతిథిగా, రక్షణ పరిశోధన, అభివృద్ధి విభాగం మాజీ కార్యదర్శి, డీఆర్‌డీవో మాజీ చైర్మన్, రక్షణ మంత్రికి మాజీ శాస్త్రీయ సలహాదారుగా విశేష సేవలందించిన ప్రముఖ వ్యక్తి డాక్టర్ రెడ్డి హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమానికి మరింత శోభను సంతరింపజేసే భారతీయ సినిమా, ప్రపంచ సంగీతానికి విశేష కృషి చేసిన ప్రఖ్యాత సంగీత స్వరకర్త, గాయకుడు, గేయ రచయిత ఎం.ఎం.కీరవాణికి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. తెలంగాణలో టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్ స్థాపించిన మొట్టమొదటి ప్రైవేటు యూనివర్సిటీ ఎస్సార్ యూనివర్సిటీనని అన్నారు. 110కి పైగా స్టార్టప్‌లకు మద్దతు నిచ్చి రూ.51లక్షల వార్షిక ప్లేస్‌మెంట్ ప్యాకేజీని కలిగి ఉందన్నారు. ఈ స్నాతకోత్సవంలో అధికారిక విద్యా ఊరేగింపు, గౌరవ డిగ్రీల ప్రదానం, గ్రాడ్యుయేట్ల పతకాలు, డిగ్రీల అందజేతతో పాటు అనేక వేడుకలు ఉంటాయని తెలిపారు. 3వేల మంది గ్రాడ్యుయేట్ విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది, పూర్వ విద్యార్థులు, ప్రముఖులు, కుటుంబాలతో సహ హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో వైస్ చాన్స్‌లర్ డాక్టర్ వి.మహేష్, రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.అర్చనారెడ్డి, కోర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



స్నాతకోత్సవ వివరాలను వెల్లడిస్తున్న ఎస్సార్ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ దీపక్ గార్గ్

ప్రభుత్వ ఐటీఐల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో ప్రవేశాలకోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా వరంగల్ ఐటీఐ ప్రవేశాల కన్వీనర్, ఐటీఐ ప్రిన్సిపాల్ ఎం.చందర్ ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి దఫా ప్రవేశాల కోసం ప్రభుత్వ నోటిఫికేషన్ జారీ చేసిందని, 8, 10వ తరగతి ఉత్తీర్ణులై 14 ఏళ్లు నిండిన వారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని ఆయన పేర్కొన్నారు. వెరిఫికేషన్ ఫీజు రూ.100 ఆన్‌లైన్‌లో చెల్లించి http://iti.telangana.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఆయన పేర్కొన్నారు. ఈనెల 21లోపు అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

6న జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో ఈ నెల 6న ములుగురోడ్‌లోని కార్యాలయంలో జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ఎం.మల్లయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండలోని ఎల్ఐసీ కార్యాలయంలో ఫుల్/పార్ట్‌టైమ్ పద్ధతిలో ఏజెంట్లుగా చేయడానికి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని యువతులకు మాత్రమే జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. 10వ తరగతి పాసైన 18 నుంచి 60 ఏళ్ల వయస్సు కలిగిన ఆసక్తి ఉన్న యువతులు వారి సర్టిఫికెట్లతో ఈ నెల 6న ములుగురోడ్‌లోని ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు హాజరుకావాలని ఆయన కోరారు.

గేదెను విక్రయించిన డబ్బులు కొడుకు అడిగాడని..

మనస్తాపంతో తండ్రి ఆత్మహత్య



సంగెం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): గేదెను విక్రయించిన డబ్బులు కొడుకు అడిగాడని మనస్తాపంతో తండ్రి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో జరిగింది. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండలంలోని బిక్కోజీనాయక్‌తండాకు చెందిన మూడు ఈరు(49) గేదెను విక్రయించిన డబ్బులు కుటుంబ అవసరాలకు ఇవ్వాలని ఈరు కుమారుడు వెంకటేశ్ సోమవారం అడిగాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో కోపోద్రిక్తుడైన ఈరు తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లి పురుగులమందు తాగాడు. పక్కనే పనులు చేసుకుంటున్న ఈరు బంధువు కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. ఈరును 108 వాహనంలో చికిత్స ఎంజీఎం దవాఖానకు తరలించారు. ఈరు చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదుతో ఎస్సై నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈరుకు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

వ్యవసాయ మార్కెట్లో సీసీ కెమెరాలు

రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ సురేంద్రమోహన్

వరంగల్ వ్యవసాయం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ సురేంద్రమోహన్ మంగళవారం ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించారు. డైరెక్టర్‌గా ఆయన బాధ్యతలు తీసుకున్న తరువాత ఇక్కడికి రావడం ఇదే మొదటిసారి కావడంతో మార్కెటింగ్‌శాఖ జాయింట్ డైరెక్టర్ ఉప్పుల శ్రీనివాస్, డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి, డీఎంవో సురేఖ, మార్కెట్ కమిటీ కార్యదర్శి గుగులోతు రెడ్డి ఆయనకు ఘన స్వాగతం పలికారు.

అనంతరం ఆయన అధికారులతో కలిసి మార్కెట్లోని అన్ని యార్డులను తిరిగి క్రయవిక్రయాలను పరిశీలించారు. గిట్టుబాటు ధరల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. యార్డులలో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. తదుపరి మార్కెట్ ప్రధాన కార్యాలయంలో అధికారులు, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. వారు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకురావడంతో పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. మార్కెట్లో అత్యాధునిక ఏఐ టెక్నాలజీతో కూడిన సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, టెండర్లను పిలిచి పనులను అప్పగిస్తామని అన్నారు. అదే విధంగా మార్కెట్లో ఉన్న వే బ్రిడ్జీలను వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటామని, మార్కెట్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని సదుపాయాలు కల్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రేడ్ 2 కార్యదర్శులు రామోజు రాము, అంజిత్‌రావు, రాజేందర్, లక్ష్మీనారాయణ, నర్సింగరావు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

చోరీల నియంత్రణపై దృష్టి సారించండి..

పోలీసు అధికారులకు సీపీ సన్‌ప్రీత్ సింగ్ సూచన

వరంగల్ క్రైం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): చోరీల నియంత్రణపై పోలీసు అధికారులు దృష్టి సారించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ అధికారులకు పిలుపునిచ్చారు. నెలవారీ నేర సమీక్ష సమావేశం మంగళవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ సమావేశ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా చోరీ కేసులో నిందితుల అరెస్టు, సొమ్ము రికవరీ, ఆస్తి నేరాలు, పెండింగ్‌లో ఉన్న ఇతర కేసులపై ప్రధానంగా సమీక్ష నిర్వహించి, వాటి పరిష్కారానికి సలహాలు, సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీసీ కెమెరాల ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ వాటి ఏర్పాటులో ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. నేరాలకు సంబంధించిన దర్యాప్తులో అధికారులు టెక్నాలజీ తో పాటు శాస్త్రీయ పద్ధతిని పాటించాలన్నారు. వాహనాలు చోరీ కాకుండా ఉండేందుకు ఇంటి ఆవరణంలోనే వాహనాలు పార్కింగ్ చేసుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రాబోయే బక్రీద్ పండుగను దృష్టిలో పెట్టుకొని మూగజీవాల రవాణాలపై ప్రత్యేక దృష్టిపెట్టడంతోపాటు దర్గాల వద్ద పటిష్ఠమైన భద్రత ఏర్పాటు చేయాలన్నారు. వరంగల్‌కు ఉన్న కీర్తిప్రతిష్ఠలకు తగ్గట్లుగా పోలీసింగ్ ఉండాలని, ప్రతీ పోలీస్ బేసిక్ పోలీసింగ్‌పై దృష్టిపెట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీసీపీలు షేక్ సలీమా, రాజ మహేంద్రనాయక్, అంకిత్‌కుమార్, జనగామ ఏఎస్పీ చైతన్య, అదనపు డీసీపీలు రవి, సురేశ్‌కుమార్, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని కంటతడి

పెద్దవంగర, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగరలో మంగళవారం 137 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదవారి సొంత ఇంటి కల నెరవేర్చిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలను అర్హులకు అందిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలుపునకు కృషి చేయాలన్నారు. కాగా, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి భావోద్వేగంతో కంటతడి పెట్టారు. చిన్న వయస్సులో పేదలకు ఇళ్లు అందించే అవకాశం కల్పించిన ప్రజలకు, సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. పాలకుర్తి నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకోలేనిదన్నారు.

కేయూ ఎన్టీవోస్, 4వ తరగతి ఉద్యోగుల ఎన్నికలు

కేయూ క్యాంపస్ జూన్ 3, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఎన్టీవోస్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘాల ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ ఎన్నికల నోటిఫికేషన్‌ను వెలువరించారు. జూన్ 9 వరకు పదవులకు నామినేషన్లు స్వీకరిస్తామని, 20న ఎన్నికలు నిర్వహించి, 21న ఫలితాలను వెల్లడిస్తామని షెడ్యూల్ ప్రకటించారు. ఎన్టీవోస్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘాలకు వేర్వేరుగా నామినేషన్లు దాఖలు చేయాలని ప్రకటించారు. ప్రెసిడెంట్-1, వైస్ ప్రెసిడెంట్-1, జనరల్ సెక్రటరీ-1, జాయింట్ సెక్రటరీలు-3 (ఆర్గనైజేషన్-1, ఆర్గనైజేషన్-1 (వుమెన్స్) రిక్రియేషన్-1), ట్రెజరర్-1 పోస్టులకు బ్యాలెట్ పేపర్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. జూన్ 9 సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, వెంటనే నామినేషన్ల పరిశీలన చేపట్టిన అర్హులైన అభ్యర్థుల వివరాలను వెల్లడిస్తామని స్పష్టం చేశారు. జూన్ 13న సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుందని, అదే రోజు సాయంత్రం 6 గంటలకు ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా విడుదల చేస్తామని పేర్కొన్నారు. జూన్ 20న శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఓటింగ్ సాగుతుందని తెలిపారు. జూన్ 21న ఉదయం 11 గంటలకు ఎన్నికల కౌంటింగ్ నిర్వహించి ఫలితాలను వెల్లడిస్తామని స్పష్టం చేశారు. కేయూ సెనెట్‌హాల్, వర్సిటీ క్యాంపస్ కళాశాల, సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, ఖమ్మం యూనివర్సిటీ పీజీ కళాశాల, కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాలలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికైన కార్యవర్గం రెండేళ్లపాటు పదవిలో కొనసాగుతుందన్నారు. కాగా వర్సిటీ పరిధిలోని ఎన్టీవోస్ కేటగిరిలో 230 మంది, నాలుగోతరగతి ఉద్యోగులు 80 మంది పనిచేస్తున్నారు. వర్సిటీ క్యాంపస్‌తో పాటు ఖమ్మం, ఆర్ట్స్అండ్‌సైన్స్ కళాశాల, లా కాలేజ్, సుబేదారిలోని యూనివర్సిటీ పీజీ కళాశాల, ఖమ్మం పీజీ కళాశాల, కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాల, వర్సిటీ కో ఎడ్యుకేషన్, మహిళ ఇంజనీరింగ్ కళాశాలలున్నాయి.

నేడు రాజగోపురాలకు భూమి పూజ

వేద పాఠశాల భవనానికి శంకుస్థాపన

హాజరుకానున్న మంత్రి, ఎమ్మెల్యేలు, అధికారులు

వరంగల్ కల్చరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వరంగల్ భద్రకాళి ఆలయ అభివృద్ధి పనుల్లో భాగంగా నాలుగు నిర్మాణం కోసం బుధవారం ఉదయం భూమి పూజ చేస్తారు. అంతేగాకుండా వేద పాఠశాల భవనానికి శంకుస్థాపనతో పాటు అర్చక కుటీరం, అన్నదాన సత్రం, దేవస్థానం కార్యాలయం నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తారు. ఈ కార్యక్రమాలకు రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, అధికారులు పాల్గొంటారని ఈవో శేషు భారతి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ధార్మిక సలహాదారుడు ఆర్.గోవిందహరి, రాష్ట్ర ప్రధాన స్థపతి వల్లీ నాయగం, దేవాదాయ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ కె.దుర్గాప్రసాద్, మాడవీధుల నిర్మాణ పనులు, భూమి పూజ జరిగే ప్రాంతాలను పర్యవేక్షించి పలు సూచనలు చేశారు. అనంతరం వారు వల్లభ గణపతిని, భద్రకాళి అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో శేషు భారతి, ప్రధానార్చకులు భద్రకాళి శేషు, సూపరింటెండెంట్ అద్దంకి విజయ్‌కుమార్, ఇంజనీర్లు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకున్న ఆర్. గోవిందహరి

శాంతి భద్రతలపై అప్రమత్తంగా ఉండాలి

ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ ● మామునూరులో పీస్ కమిటీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ అంకిత్ కుమార్

మామునూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల విషయంలో పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్ కుమార్ సూచించారు. మంగళవారం మామునూరులోని ఓ ఫంక్షన్ హాల్‌లో అన్ని మతాలకు సంబంధించిన పెద్దలతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. రాబోయే బక్రీద్ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని ముస్లిం మత పెద్దలకు సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో మామునూరు ఏసీపీ వేంకటేశ్, పరకాల ఏసీపీ సతీష్ బాబు, మామునూరు సీఐ రమేష్, పర్వతగిరి సీఐ.రాజ్‌గోపాల్, ఏనుమాముల సీఐ రాఘవేదర్, గీసుకొండ సీఐ మహేందర్, పరకాల సీఐ క్రాంతికుమార్, శాయంపేట సీఐ రంజిత్, దుగ్గొండి సీఐ రమణ, నెక్కొండ సీఐ శ్రీనివాస్, మామునూరు, పరకాల, నర్సంపేట పోలీసు సబ్ డివిజన్ల పరిధిలోని ఎస్ఐలు పాల్గొన్నారు.

సమ్మక్క సాగర్ బ్యారేజీలో మరొక్క గేటు ఎత్తివేత



కన్నాయిగూడెం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని తుపాకులగూడెం వద్ద ఉన్న సమ్మక్క సాగర్ బ్యారేజీ నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. సోమవారం వరకు బ్యారేజీలోని ఒక గేటు ద్వారా నీటిని దిగువకు వదిలిన అధికారులు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో పెరగడంతో బ్యారేజీలో నీటి నిల్వలు పెరిగాయి. దీంతో మరొక గేటును ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ఎగువ నుంచి 5,500 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండడంతో రెండు గేట్ల ద్వారా 6,000 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. బ్యారేజీ పూర్తి స్థాయి నీటి మట్టం 6.94 టీఎంసీలు కాగా ప్రస్తుతం 2.892 టీఎమ్సీల నీళ్లు నిల్వ ఉన్నాయి. బ్యారేజీ వద్ద 78.10 మీటర్ల నీటి మట్టం నమోదైంది.

రేపటి నుంచి పలు రైళ్లు రద్దు

కాజీపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వేలోని బెల్లంపల్లి - రెచ్నీరోడ్ రైల్వే స్టేషన్‌ల మధ్య నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల దృష్ట్యా ఈ నెల 5 నుంచి 20 వరకు పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. రద్దయిన రైళ్ల వివరాలు ఇలా ఉన్నాయి. (17003) కాజీపేట - సిర్పూర్‌కాగజ్ నగర్‌ల మధ్య రామగిరి ప్యాసింజర్ రైలు అప్ అండ్ డౌన్, (17035) కాజీపేట నుంచి బల్లార్ష వైపు నడిచే తెలంగాణ ఎక్స్‌ప్రెస్ అప్‌అండ్ డౌన్, (12757) సికింద్రాబాద్ నుంచి కాగజ్‌నగర్ వైపు వెళ్లే కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్, అప్‌అండ్ డౌన్, (20101) నాగ్‌పూర్ నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్లే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ అప్‌అండ్ డౌన్ , (22533) గోరఖ్ పూర్ నుంచి యశ్వంతాపూర్ వెళ్లే యశ్వంతాపూర్ ఎక్స్‌ప్రెస్ అప్‌అండ్ డౌన్ రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఢిల్లీ వైపు వెళ్లే మరికొన్ని రైళ్లను దారి మళ్లించి నిజామాబాద్ మీదుగా నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

'లక్నవరం'లో పడి వ్యక్తి మృతి

గోవిందరావుపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు లక్నవరం సరస్సులో పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బుస్సాపూర్ గ్రామానికి చెందిన కాలేని సమ్మయ్య(40) గత కొన్నేళ్లుగా హమాలీ పని చేసుకుం టూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో పని ముగించుకుని సమ్మయ్యతోపాటు తోటి కూలీలు సరస్సును చూడడానికి వెళ్లారు. ఈ సమయంలో అందరూ భోజనం చేస్తుండగా సమ్మయ్య కనిపించకుండా పోయాడు. దీంతో అక్కడ ఉన్నవారు సరస్సులో వెతకగా మృతదేహం లభ్యమైంది. ఈవిషయాన్ని పస్రా పోలీసులకు తెలుపగా ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా, మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



సమ్మయ్య (ఫైల్)

వర్క్ అడ్జెస్ట్‌మెంట్ సరికాదు..

- సర్కారు ఉత్తర్వులపై ఉపాధ్యాయుల గుర్రు
- పాఠశాలలు ప్రారంభం కాకముందే ఎలా చేస్తారని ప్రశ్న

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వర్క్ అడ్జెస్ట్‌మెంట్ పేరిట ప్రభుత్వం గత నెల 28న జారీ చేసిన ఉత్తర్వులు ప్రభుత్వ అనాలోచిత నిర్ణయానికి నిదర్శనమని ఉపాధ్యాయ వర్గాలు విమర్శిస్తున్నాయి. పాఠశాలు ప్రారంభం కాకముందే పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలనే ప్రభుత్వ విధానాలను ఆక్షేపిస్తున్నారు. బడిబాట ప్రారంభం కాకముందే, విద్యార్థుల ప్రవేశాలు పొందకముందే ఉపాధ్యాయులను వర్క్ అడ్జెస్ట్‌మెంట్ ఏ ప్రాతిపాదికన చేస్తారని ప్రశ్నిస్తున్నారు. గత ఏడాది చేసిన సర్దుబాటులో వివిధ పాఠశాలల్లో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఇప్పటి వరకు రిలీవ్ చేయలేదని, అలాంటప్పుడు ఇప్పుడు మరోసారి సర్దుబాటు ఎలా చేస్తారని ఉపాధ్యాయ వర్గాలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాయి. 60 మంది విద్యార్థులకు ఇద్దరు టీచర్లు మాత్రమే ఉండాలనే నిబంధన సరికాదని, దీనివల్ల విద్యార్థులకు విద్యాబోధనలో తీవ్రమైన అన్యాయం జరుగుతుందంటున్నారు. 30 వరకు విద్యార్థులకు ముగ్గురు టీచర్లు, 60 మందికి అయిదుగురు టీచర్లు ఉండాలని, ప్రతీ ప్రాథమిక పాఠశాలకు ఎల్ఎఫ్ఎల్ హెచ్ ఉంటేనే ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు న్యాయం జరుగుతుందని వారు చెబుతున్నారు.

బడిబాట తర్వాత సర్దుబాటు..

ప్రభుత్వం బడిబాట కార్యక్రమాన్ని ఈ నెల 6 నుంచి 19 వరకు నిర్వహించేందుకు షెడ్యూల్‌ను విడుదల చేసింది. బడిబాట పూర్తైన తర్వాత ఆయా పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాల సంఖ్యను బట్టి విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా విద్యార్థులకు బోధన ప్రమాణాలు అందించేందుకు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు సూచిస్తున్నారు. గతేడాది సర్దుబాటు చేసిన ఉపాధ్యాయులను ఈ ఏడాది సైతం డిప్యూటేషన్‌పై అక్కడే కొనసాగిస్తున్నారు. వారిని రిలీవ్ చేయకుండానే మరోమారు ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తే పరోక్షంగా పాఠశాలల మూసివేతకు ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు ఉపాధ్యాయ వర్గాలు ఆలోచన చేయాల్సి వస్తుందంటున్నారు. బడిబాట కార్యక్రమం ముగిసిన తర్వాత జూన్ చివరన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల సర్దుబాటు చేస్తే ఆమోదయోగ్యంగా ఉంటుందని వారు అంటున్నారు.

గత ఏడాది ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియలో వరంగల్ జిల్లాలో 225 మంది, హనుమకొండ జిల్లాలో 122 మంది ఉపాధ్యాయులు డిప్యూటేషన్‌పై ఇతర పాఠశాలల్లో పనిచేస్తున్నారని, వారి డిప్యూటేషన్ రద్దు చేశాక, బడిబాట కార్యక్రమం అనంతరం మాత్రమే ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను చేపట్టాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.



పల్లెల్లో సాగు సందడి

ఈ ఏడాది రుతుపవనాలు ముందుగానే ప్రవేశించడంతో అన్నదాత కదిలాడు. ఏరువాక పౌర్ణమికి ముందే సాగు పనులు ప్రారంభమయ్యాయి. పత్తి కట్టె తీయడం, హలాలతో దుక్కులు దున్నడం, యంత్రాలు, ఎద్దుల సాయంతో వ్యవసాయ భూములను దున్నుతున్నారు. సేంద్రియ ఎరువులు చల్లుతున్నారు. ఒకపక్క విత్తన శుద్ధి చేస్తూ మరో పక్క విత్తనాలను చకచకా వేస్తున్నారు. పల్లెలు వ్యవసాయ పనులతో కళకళలాడుతున్నాయి. వెంకటాపూర్ మండల కేంద్ర శివారు ఉప్పరచెరువు శివారులో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమవ్వగా ఆంధ్రజ్యోతి క్లిక్‌మనిపించింది.

- వెంకటాపూర్(ఆంధ్రజ్యోతి)





వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులు



జగదీశ్ తల్లిదండ్రులకు మంత్రి సన్మానం

కృతజ్ఞతలు తెలిపిన బీఆర్ఎస్ నాయకులు

ములుగుటౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మల్లంపల్లి మండలానికి జేడీ మల్లంపల్లిగా నామకరణం చేయడంపై బీఆర్ఎస్ నాయకులు రాష్ట్ర పంచాయ తీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్కకు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం మంత్రి సీతక్క మల్లంపల్లిలో జేడీ మల్లంపల్లి మండలం పేరుతో బోర్డును ఏర్పాటు చేయడంతో పాటు మాజీ జడ్పీచైర్మన్ కుసుమ జగదీశ్ తల్లిదండ్రులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్‌తోపాటు కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మాజీ జడ్పీచైర్మన్ జగదీశ్ తల్లిదండ్రులను సన్మానిస్తున్న మంత్రి సీతక్క



కాళేశ్వరాలయం

కాళేశ్వరాలయం హోదా పెంపు ?

- 6ఏ స్థాయి నుంచి అసిస్టెంట్ కమిషనర్ స్థాయికి...
- త్వరలో ఉత్తర్వులు వస్తాయన్న మంత్రి శ్రీధర్‌బాబు

మహదేవపూర్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ కాళేశ్వర ఆలయాన్ని 6ఏ స్థాయి నుంచి అసిస్టెంట్ కమిషనర్ హోదా అధికారి గల టెంపుల్‌గా అప్‌గ్రేడ్ చేయనున్నారు. ఈ విషయాన్ని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మంగళవారం తెలిపారు.ఈ మేరకు దేవాదాయ శాఖ కమిషనర్‌కు ఆదేశాలు సైతం ఇచ్చినట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే ఆలయ అప్‌గ్రేడ్ ప్రక్రియను దేవాదాయ శాఖ అధికారులు ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. ఈ నెల చివరి వరకు ఉత్తర్వులు వచ్చే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు. కొద్దిరోజుల క్రితం జరిగిన సరస్వతి పుష్కరాలకు 12 రోజులకు గాను రూ.3 కోట్ల ఆదాయం సమకూరింది. అంతేగాకుండా ఆలయానికి రోజురోజుకు భక్తుల తాకిడి పెరుగుతోంది. ఇప్పటివరకు కాళేశ్వరం 6ఏ హోదాతో ఉండేది. దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ హోదా రావడంతో వేములవాడ ఆలయంతో సమానంగా మారనుంది. అప్‌గ్రేడ్‌తో ఆలయ అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు కానున్నాయి. అంతేగాకుండా సిబ్బంది సంఖ్య పెరగనుంది. ఆలయంలో ఎలాంటి పొరపాట్లు జారీ చేసినా అసిస్టెంట్ కమిషనర్ హోదా కలిగిన అధికారి వెంటనే సిబ్బంది సస్పెండ్ చేసే అధికారం ఉంటుంది. ప్రతి ఏడాది ఆలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వ నిధులు మంజూరవుతాయి.



వివాహ పత్రికతో పాటు మొక్కను అందిస్తున్న సాయి చంద్, కుటుంబ సభ్యులు

శుభలేఖ.. ఓ మొక్క..

- వినూత్న రీతిలో ఓ యువకుడి వివాహ ఆహ్వానం
- పర్యావరణ పరిరక్షణ కోసం ప్రయత్నం

హనుమకొండ టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిరక్షించడం కోసం ఓ యువకుడు నడుం బిగించాడు. వరంగల్ విద్యానగర్‌కు చెందిన గుండపు సాయి చందు అనే యువకుడు తన వివాహానికి సంబంధించిన శుభలేఖతో పాటు మొక్కను అందజేస్తూ వినూత్నరీతిలో ఆహ్వానిస్తున్నాడు. సాయి చందు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 5న పర్యావరణ దినోత్సవం, తన వివాహం ఉండగా వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టాడు. ప్లాస్టిక్‌ను అంతమొందించి పర్యావరణాన్ని కాపాడేందుకు తన వివాహానికి సంబంధించిన శుభలేఖలను పంచుతూ మొక్కలను, స్టీల్ వాటర్ బాటిళ్లను పంచుతున్నారు. తన సమీప బంధువైన ప్రముఖ సామాజిక వేత్త సుంకరి ప్రశాంత్‌తో కలిసి ఈ వినూత్న కార్యక్రమానికి సాయి చందు శ్రీకారం చుట్టారు. వివాహంలో సైతం ప్లాస్టిక్‌ను నిర్మూలించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సాయిచంద్ ప్రకటించారు.


అరచేతిలో వాతావరణం

- యాప్‌ల ద్వారా రైతులకు ఉపయోగం
- ప్రజలను అప్రమత్తం చేస్తున్న వాతావరణ శాఖ

వరంగల్ వ్యవసాయం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు అకాల వర్షాలు కోలుకోలేని నష్టాలను తెచ్చిపెడుతాయి. ఏ క్షణాన వర్షం పడుతుందో.. ఏ క్షణాన పిడుగు పడుతుందో.. తెలియని పరిస్థితి. పిడుగు పాటుకు మనుషులు, మూగజీవాలు మృత్యువాత పడ్డ ఘటనలు అనేకం ఉన్నాయి. ఇలాంటి ప్రమాదాలనుంచి రైతులను, ప్రజలను అప్రమత్తం చేసి ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం, వాతావరణ శాఖ మేఘదూత్, దామిని, రెయిన్ అలారం అనే మూడు ప్రత్యేక యాప్‌లను రూపొందించింది. వీటిని స్మార్ట్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకుంటే చాలు. ఎక్కడ పిడుగు పడుతుంది.. ఎక్కడ వర్షం పడుతుందనే విషయాలను తెలుసుకోవచ్చు. అంతేకాదు.. రాబోయే ఐదు రోజుల వాతావరణ పరిస్థితులు ఎలా ఉంటాయో కూడా ఇది తెలియజేస్తుంది. స్మార్ట్‌ఫోన్‌లో గూగుల్ ప్లేస్టోర్‌లోకి వెళ్లి యాప్‌లను డౌన్ లోడ్ చేసుకోవచ్చు. యాప్ డౌన్‌లోడ్‌కు వినియోగదారులు పూర్తి వివరాలను అందించాల్సి ఉంటుంది.

రెయిన్ అలారం

పంటలు పండించి నూర్పిడి చేసి ధాన్యం ఇంటికి చేర్చే వరకు రైతుకు కంటిమీద కునుకుండదు. ధాన్యం సిద్ధం చేసుకున్న తరువాత అకాల వర్షం వల్ల తడిచిపోయి తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ఈ సమస్యకు రెయిన్ అలారం యాప్ ద్వారా పరిష్కారం లభిస్తుంది. వినియోగదారుడు అందించిన సమాచారం మేరకు సుమారు 20 కిలోమీటర్ల మేర ఎక్కడ వర్షం కురిసే అవకాశం ఉందనే సమాచారం క్షణాల్లో అందిస్తుంది. దీంతో రైతులు అప్రమత్తం అయ్యేందుకు అవకాశం ఉంటుంది.



వాతావరణ పరిస్థితులను తెలిపే మేఘదూత్ యాప్

దామిని..

ఏప్రిల్, మే నెలల్లో అకాల వర్షాలు, పిడుగులు పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. పొలాల వద్దకు వెళ్లిన రైతులు, ప్రయాణాల్లో ఉన్నవారు వర్షం ప్రారంభం కాగానే చెట్ల కిదకు వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. వర్షం కురిసే సమయంలో చెట్ల కిందకు వెళ్లడం శ్రేయస్కరం కాదని నిపుణులు చెబుతున్నారు. దామిని యాప్ ద్వారా ఐదు నుంచి 20 నిమిషాల్లో 20 కిలోమీటర్ల పరిధిలో ఎక్కడ పిడుగు పడుతుందో పక్కా సమచారం అందిస్తుంది. ఇది రైతులకు, ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

మేఘదూత్

పంటలకు, రైతులు రసాయన ఎరువులు పిచికారి చేస్తుంటారు. కొన్ని సందర్భాల్లో పిచికారి చేసి ఇంటికి వచ్చిన వెంటనే వర్షం పడుతుంది. దీంతో పిచికారిచేసిన మందుతో పాటు సమయం వృథా అవుతుంది. అందుకోసమే కేంద్ర ప్రభుత్వం వాతావరణ విషయాలను ఎప్పటికప్పుడు ప్రజలు, ముఖ్యంగా రైతులు తెలుసుకునేందుకు ప్రత్యేకంగా యాప్‌లను రూపొందించింది. ఇందులో భాగంగా మేఘదూత్ యాప్ అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్ ఎప్పుకటిపప్పుడు వాతావరణ విషయాలను వెల్లడిస్తుంది. రాబోయే ఐదు రోజుల్లో వాతావరణంలో మార్పులు, వర్ష సూచన, ఆకశం మేఘావృతం అవుతుందా..? ఈదురుగాలులు ఎక్కడి నుంచి ఎటు వైపు వీస్తాయనే సమాచారాన్ని అందిస్తుంది.

సంపద పెరిగితే ఆకలిచావులు ఎందుకు?

- ప్రజాధనం కార్పొరేట్‌కు కేంద్రం ధారాదత్తం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు
- నర్మెటలో సీపీఐ జనగామ జిల్లా నాలుగో మహాసభలు



నర్మెటలో మహాసభలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

నర్మెట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : పదేళ్లలో దేశంలో తలసరి ఆదాయం రెట్టింపు అయితే ఆకలి చావులు, రైతు ఆత్మహత్యలు ఎందుకు ఉన్నాయని, ప్రధాని మోదీ పాలనలో సంపద అంతా కార్పొరేట్ శక్తులైన అంబానీ, అదానీల వద్దే కేంద్రీకృతమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం జనగామ జిల్లా నర్మెట మండలకేంద్రంలో సీపీఐ జిల్లా నాల్గవ మహాసభలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి అధ్యక్షత వహించగా కూనంనేని ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పెట్టుబడిదారులకు కమ్యూనిస్టులే ప్రత్యామ్నాయని, కార్పొరేట్ శక్తులకు కేంద్రం ప్రజా సంపదను ధారాదత్తం చేస్తోందని ఆరోపించారు. యాభై లక్షల కోట్లు ఉన్న అప్పు నేడు నూట అరవై కోట్లకు పెరిగిందన్నారు. మోదీ ప్రభుత్వంలో నిరుద్యోగం, పేదరికం పెరిగిందని, వెనుకబడిన తరగతులకు 42శాతం రిజర్వేషన్‌లు ఆర్థిక, సాంఘిక, రాజకీయ ఉద్యోగ కాంట్రాక్టు రంగాల్లో వెంటనే అమలు చేయాలన్నారు. ఆపరేషన్ కగార్ నిలిపివేసి శాంతి చర్చలు జరపాలని కూనంనేని డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లా సమగ్ర అభివృద్ధికి పార్టీ రాజీలేని ప్రజా పోరాటాలు చేస్తోందన్నారు. తెలంగాణ రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన హామీలను నేరవేర్చడంలో కేంద్రం విఫలమైందన్నారు. మోదీ శంకుస్థాపన చేసిన కోచ్ ఫ్యాక్టరీ ఇంకా అనుమతి రాలేదన్నారు. రాష్ట్రంలో రైతులు రెండు లక్షల వరకు రుణమాఫీ చేయాలన్నారు.

గ్రామంలో భారీ ర్యాలీ..

జిల్లా మహాసభ నేపథ్యంలో నర్మెటలో సీపీఐ భారీ ప్రజా ప్రదర్శన చేపట్టింది. కార్యకర్తలు ఎర్రజెండాలతో ర్యాలీలో పాల్గొనడంతో గ్రామమంతా ఎరుపుమయం అయింది. అనంతరం మహాసభలో వక్తలు ప్రసంగించారు.

కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు పాతూరి సుగుణమ్మ, జిల్లా సహాయ కార్యదర్శులు ఆది సాయన్న, ఆకుల శ్రీనివాస్, చొప్పరి సోమయ్య, కావటి యాదగిరి, జువారి ఎల్లయ్య, బోనగిరి కుమారస్వామి, నీల కనకయ్య పాల్గొన్నారు.

ఇనుగుర్తి అభివృద్ధికి కృషి

- కార్యాలయాలకు ఒకేచోట శాశ్వత భవనాలు
- సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి

ఇనుగుర్తి (మహబూబాబాద్ జిల్లా), జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : నూతనంగా ఏర్పాటైన ఇనుగుర్తి మండల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి అన్నారు. ఇనుగుర్తిలో మంగళవారం యువజన సంఘం, విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ఆయనతో కలిసి రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇనుగుర్తిలో త్వరలో పోలీస్‌స్టేషన్ ఏర్పాటు కాబోతోందని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలకు శాశ్వత భవనాలన్నీ ఒకేచోట ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యేరాంచంద్రు నాయక్ మాట్లాడుతూ అంబేద్కర్ సూచించిన బోధించు, సమీకరించు, పోరాడు సూక్తులను ఆచరించాలని కోరారు. ఎంపీ బలరాంనాయక్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలకనుగునంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజాపాలన కొనసాగిస్తోందని తెలిపారు. ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ అంబేద్కర్ ప్రసాదించిన హక్కులతోనే మనం అందరం విద్య, ఉద్యోగ, రాజకీయ అవకాశాలను అందిపుచ్చుకొని ఉన్నతస్థానాల్లో ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎంపీ కవిత, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, మాజీ డీజీ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అవిలయ్య, జిల్లా అధ్యక్షుడు కామ సంజీవరావు, స్థానిక అధ్యక్షుడు పప్పుల వెంకన్న, మాంకాలి సలీంరాం, గోపందాస్ కృష్ణ, దార్ల రాంమూర్తి, గుజ్జునూరి బాబురావు, బేతమల్ల చంద్రయ్య పాల్గొన్నారు.



ఇనుగుర్తిలో అంబేద్కర్ విగ్రహావిష్కరణలో పాల్గొన్న సీఎం సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్యేలు

జోరుగా నిషేధిత పత్తి విత్తనాల విక్రయం

- మారుమూల గ్రామాల్లో క్రయ విక్రయాలు
- తనిఖీలు చేపట్టని అధికారులు

చిట్యాల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మారుమూల పల్లెల్లో ప్రజలు వ్యవసాయాధారితంతోనే జీవనం గడుపుతుంటారు.. అమాయక రైతుల అవసరాలను ఆసరా చేసుకుని నిషేధిత విత్తనాలను అంటగట్టేందుకు దళారులు జోరుగా తిరుగుతున్నారు. నిషేధిత బీటీ-3 పత్తి విత్తనాల క్రయవిక్రయాలు చిట్యాల, టేకుమట్ల మండలాల్లో జోరందుకున్నాయి. సంబంధిత అధికారులు తనిఖీలు చేయకపోవడంతో రైతుల ఆరోగ్యం పాడవుతుందని తెలియక అధిక ధరలు చెల్లించి బీటీ3 విత్తనాలను కొనుగోలు చేస్తున్నారు.

గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించడంలో వ్యవసాయ శాఖ అధికారులు విఫమవుతున్నారన్న ఆరోపణలు మెండుగా వినిపిస్తున్నాయి. చిట్యాల మండలంలోని నైన్‌పాక, వరికోల్‌పల్లి, జడల్‌పేట, బావుసింగ్‌పల్లి, ముచినిపర్తి, గుంటూరుపల్లి తదితర గ్రామాల్లో పలువురు దళారులు బీటీ3 విత్తనాలను డంప్ చేసి అమాయక రైతులకు అధిక ధరలకు అంటగడుతూ సొమ్ముచేసుకుంటున్నారు. ఒక్కో ప్యాకెట్‌ను రూ.16వందలకు విక్రయిస్తుండగా ఎకరాలకు 2 ప్యాకెట్లు అవసరమవున్నట్లు సమాచారం. వీటితో పాటు బిడివిత్తనాలు సైతం కిలో. రూ.3500 లకు విక్రయిస్తున్నారు.



తనిఖీలేవి..!

వానాకాలం వ్యవసాయ సీజన్ ప్రారంభం అయినా సంబందిత అధికారులు ఇప్పటివరకు తనిఖీలు చేయకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. నిషేదిత బీటీ విత్తనాల క్రయవిక్రయాల సమాచారం తెలిసినా మనకెందులే అని మామూళ్లు తీసుకుంటున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. సంబందిత శాఖల అధికారులు తనిఖీలు చేసి నిషేదిత బీటీ3 విత్తనాల క్రయవిక్రయాలను అడ్డుకుని, వాటివల్ల కలిగే అనార్థాలపై రైతులకు అవగాహన కల్పించాలని పలువురు రైతులు డిమాండ్ చేస్తున్నారు.

కలుపు ఖర్చు మిగులుతుందని

బీటీ3 పత్తి విత్తనాలతో ఆరోగ్యానికి హానికరం, భూసారం కోల్పోతుందని పరిశోధనల్లో తేలడంతో రాష్ట్ర ప్రభుత్వం బీటీ-3 విత్తనాల అమ్మకాలను నిషేదించింది. కానీ విత్తనాలు మొలకెత్తిన తర్వాత గడ్డి మందు పిచికారీ చేసినా మొక్కలకు ఎలాంటి ప్రమాదం లేదు. దీంతో కలుపు నివారణ సులభతరమని, కూలీల ఖర్చు తగ్గుతుందని కొంత మంది దళారులు అమాయక రైతులను నమ్మిస్తున్నారు. మిగిలిన రకం విత్తనాలకు గడ్డి మందు పిచికారీ చేస్తే పత్తి మొక్కలు ఎండిపోతాయి. నిషేదిత బీటీ3 పత్తి విత్తనాలతో పాటు నిషేదిత గడ్డిమందు (గ్లైఫోసెట్) ను పలు గ్రామాల్లో డంప్ చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

ఘనంగా రేణుక ఎల్లమ్మ కల్యాణోత్సవం



స్టేషన్‌ఘన్‌పూర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): తాటికొండలో నూతనంగా నెలకొల్పిన రేణుక ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం భక్తులు పూజలు చేశారు. బైండ్ల పూజారి, ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మ-జమదాగ్ని మహర్షిల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎల్లమ్మ తల్లికి మాజీ వైస్ ఎంపీపీ చల్లా సుధీర్ రెడ్డి- మాజీ సర్పంచ్ చల్లా ఉమాదేవి దంపతులు మంగళసూత్రాలు అందించారు. మంగళ సూత్రాలతో భక్తులు ర్యాలీగా వచ్చి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా సువర్ణ పుష్పార్చన



చిలుపూర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): అష్టదళ పాద పద్మారాధనను పురస్కరించుకుని చిలుపూర్ గుట్టబుగులు వేంకన్న దేవాలయంలో సువర్ణ పుష్పార్చన కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, ఈవో భాగం లక్ష్మీప్రసన్న స్వామి వారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం రూ.60లక్షల విలువ గల 108 బంగారు పుష్పాలను స్వామివారి పాదాలకు అలంకరించారు.

అలరించిన చిందు కళాకారుల ప్రదర్శన



ఎల్లమ్మ వేషధారణతో వచ్చిన సుగుణను దళితుల స్వాగతం

దేవరుప్పుల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): నెల రోజులుగా మండలంలోని కామారెడ్డిగూడెంలోని దళితవాడలో వనపర్తి, నెల్లుట్ల,చెన్నూరు గ్రామాలకు సంబంధించిన చిందు కళాకారులు, ప్రభుత్వాలు చిందు కళపై చిన్నచూపు చూస్తుండటంతో పూట గడవడం కోసం గ్రామాల్లో వేషాలు వేస్తూ నృత్యాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం వనపర్తికి చెందిన చిందుకళాకారిణి సుగుణ చివరిరోజు ఎల్లమ్మ తల్లి వేషధారణతో గ్రామంలోని దళిత వాడలో రంగప్రవేశం చేయగా పండుగ వాతావరణం నెలకొంది. ఇంటింటికి కలి కుండలు, లందగోళాలు ఏర్పాటు చేసి స్వాగతించారు. కార్యక్రమంలో చిందు కళాకారుల బృందం పరశురాములు, యాదగిరి, మహేందర్, వెంకటాద్రి పాల్గొన్నారు.

గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు



తిమ్మంపేటలో దరఖాస్తులను పరిశీలిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ హనుమానాయక్

బచ్చన్నపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): భూసమస్యలు పరిష్కరించేందుకే తెలంగాణ ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకువచ్చిందని అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ తెలిపారు. మంగళవారం బసిరెడ్డిపల్లిలో రెవెన్యూ సదస్సు జరగగా, పరిశీలించి పలు సూచనలు చేశారు. రైతులు చెప్పే సమస్యలకు సంబంధించిన వివరాలు పత్రాల్లో ఎలా నమోదు చేస్తున్నారనే విధానాన్ని పరిశీలించారు. వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో జూమ్ మీటింగ్‌లో పాల్గొన్నారు. బసిరెడ్డిపల్లిలో రైతుల నుంచి 80 దరఖాస్తులు వచ్చాయని ఇన్‌చార్జి తహసీల్దార్ ఫణికిశోర్ తెలిపారు.

- నర్మెట(ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల పరిష్కారానికే సర్కారు భూభారతి చట్టాన్ని అమలు చేస్తోందని అడిషనల్ కలెక్టర్ రోహిత్‌సింగ్ అన్నారు. మంగళవారం బొమ్మకూరులో రెవెన్యూ సదస్సులో అధికారులకు తగిన సూచనలు చేశారు.
- జఫర్‌గడ్(ఆంధ్రజ్యోతి) : రైతుల భూసమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వంఈ చట్టానికి శ్రీకారం చుట్టినట్టు జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎస్ఆర్ఎస్‌పీ) హనుమానాయక్ అన్నారు. తిమ్మంపేటలో రెవెన్యూ సదస్సులో అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఎస్.వెంకన్న నాయక్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నూకల అయిలయ్య, తహసిల్దార్ శంకరయ్య, డీటీ అనిల్‌కుమార్, ఎంఆర్‌ఐలు బలరాంపాల్గొన్నారు.
- చిలుపూర్(ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలని ఆర్డీవో డీఎస్ వెంకన్న నాయక్ రైతులకు సూచించారు. చిలుపూర్‌లో సదస్సును సందర్శించారు.
- దేవరుప్పుల(ఆంధ్రజ్యోతి): గొల్లపల్లిలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. 19మంది దరఖాస్తులు చేసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆడేపు అండాలు, డీటీ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.
- తరిగొప్పుల(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ మొగుల్ల మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నర్సాపూర్‌లో సదస్సు నిర్వహించారు. 49దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రామరావు, గిర్దావర్ ఆంధ్రయ్య పాల్గొన్నారు.
- కొడకండ్ల (ఆంధ్రజ్యోతి) : రేగులలో రెవెన్యూ సదస్సులు ప్రారంభమయ్యాయి. 62 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో ఎంఆర్వో చంద్రమోహన్, ఆర్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.



బసిరెడ్డిపల్లిలో అధికారులకు సూచనలిస్తున్న అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్

- పాలకుర్తి(ఆంధ్రజ్యోతి) : లక్ష్మీనారాయణపురం, కోతులబాదు గ్రామాల్లో సదస్సులు ప్రారంభమయ్యాయి. తహసీల్దార్ నాగేశ్వరాచారి మాట్లాడుతూ లక్ష్మీనారాయణపురంలో 20, కోతులబాదులో 25 దరఖాస్తూ వచ్చాయన్నారు.
- రఘునాథపల్లి(ఆంధ్రజ్యోతి): ఫతేషాపూర్, కాల్వలపల్లి రెవెన్యూ సదస్సులు ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో తహసీల్దార్ మోహిస్రా ముజ్జబ, డిప్యూటీ తహసీల్దార్ శంకర్, ఆర్ఐలు రవిందర్, శరత్, సర్వేయర్ నరేష్, మల్లేష్ పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో విజయం ఖాయం



సమావేశంలో మాట్లాడుతున్న శివరాజ్

జనగామ రూరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయమని జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శివరాజ్ యాదవ్ అన్నారు. కాంగ్రెస్ జనగామ పట్టణ అధ్యక్షుడు చెంచారపు బుచ్చిరెడ్డి అధ్యక్షతన మంగళవారం జనగామలోని ఓ ఫంక్షన్ హాల్లో నియోజకవర్గ ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించారు. శివరాజ్ మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను తప్పకుండా అమలు చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో నాయకులు గంగం నర్సింహారెడ్డి, మెరుగు బాలరాజు, వగలబోయిన యాదగిరి, రాజబోయిన లక్ష్మీనారాయణ, బస్సీ నాయక్, నామాల శ్రీనివాస్, శ్రీలతరెడ్డి, గామపాక రాంచంద్రం పాల్గొన్నారు.

పల్లెల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలి



దేవరుప్పుల పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న ఝాన్సీరెడ్డి

దేవరుప్పుల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానికసంస్థల ఎన్నికల్లో పల్లెల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలని పాలకుర్తి కాంగ్రెస్ ఇన్‌చార్జీ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ధర్మగడ్డతండా, పడమటితండా గ్రామాల్లో పర్యటించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో జరిగిన వేర్వేరు సమావేశాలతోపాటు మండలకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పార్టీలో అంతర్గత సమస్యలు లేకుండా ప్రతీ ఒక్క కార్యకర్త కలిసి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో విజయడైరీ జిల్లా అధ్యక్షుడు కాసారపు ధర్మారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నల్ల శ్రీరామ్, నాయకులు కాడబోయిన గణేష్, తోటకూరి పాండు కృష్ణ, పులిగిళ్ల వెంకన్న, నాగరాజు, నల్ల యాదగిరి, రాంచ ంద్రూనాయక్, జగ్రామ్ పాల్గొన్నారు.

క్రైం న్యూస్

యువకుడిపై పోక్సో కేసు

నర్మెట, జూన్3 (ఆంధ్రజ్యోతి): బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించి, అత్యాచారానికి ప్రయత్నం చేసిన యువకుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఎస్సై నగేష్ కథనం ప్రకారం. బాలిక అమ్మమ్మ ఇంటికి ఇటీవల వచ్చింది. నర్మెటకు చెందిన ఎమ్డీ ఇర్ఫాన్ అనే యువకుడు ఇంట్లో రాత్రి సమయంలో చొరబడి, నిద్రపోతున్న బాలిక నోరు మూసి, అసభ్యంగా ప్రవర్తించడమేకాక, అత్యాచారానికి ప్రయత్నించాడు. బాలిక గట్టిగా అరవడంతో ఇంట్లో ముందు రూంలో నిద్రపోతున్న అమ్మమ్మ రావడంతో పారిపోయాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు ఇర్ఫాన్‌పై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కుతరలించినట్లు ఎస్సై తెలిపారు.

పశువులను తరలిస్తున్న ముగ్గురిపై కేసు

రఘునాథపల్లి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): బక్రీద్ పురస్కరించుకొని హైదరాబాద్ కబేలాకు వాహనంలో నాలుగు పశువులను అక్రమంగా తరలిస్తుండగా ఖాంజీపేట వద్ద పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. బొలేరో వాహనంలో తరలిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ డి.నరేష్ తెలిపారు. లింగాలఘణపురం మండలం వడ్డిచర్లకు చెందిన ఎండి.మసూక్, ఎండి. సాబీర్, కొంగరి రాములను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ బత్తిని కట్టమల్లు, కానిస్టేబుల్ కుమారస్వామి,హోంగార్డుభాస్కర్ పాల్గొన్నారు.

పాడిగేదె మృతి

దేవరుప్పుల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): అప్పిరెడ్డిపల్లెకి చెందిన మహిళా రైతు బాషిపెల్లి లలితకు చెందిన పాడిగేదె గడ్డి మేసుకుంటూ మంగళవారం ఎస్ఎస్4-100కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి అక్కడికక్కడే మృత్యువాత పడింది. దీంతో రూపాయలు లక్ష నష్టం వాటిల్లినట్టు లలిత వాపోయింది.

చికిత్స పొందుతూ యువకుడు...

పాలకుర్తి, జూన్ 3(ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలతో బాదావత్ గణేష్ (25) ఆత్మహత్య యత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు. కొండాపురం శివారు మేకలతండాకు చెందిన గణేష్ తన భార్య అన్నపూర్ణ మధ్య గొడవ జరిగింది. మనస్థాపానికి గురైన గణేష్ ఆదివారం రాత్రి ఇంటి వద్ద పురుగుల మందు తాగాడు. హన్మకొండలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మంగళవారం మృతి చెందాడు. మృతుడు తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు



విత్తనాలను అందజేస్తున్న విశ్వతేజ

లింగాలఘణపురం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించడమే లక్ష్యంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఊరూరా నాణ్యమైన విత్తనాల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త విశ్వతేజ అన్నారు. మంగళవారం సిరిపురం రైతు వేదికలో మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు అధ్యక్షత రైతు నేస్తం సమావేశాన్ని ఏర్పాటు చేసి అవగాహన సదస్సును నిర్వహించారు. విశ్వతేజ మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాలతో అధికపంట దిగుబడి సాధ్యపడుతుందన్నారు. ప్రతీ రెవెన్యూ గ్రామానికి 10కిలోల బరువుగల రెండు ధాన్యం విత్తనాల సంచులు, మూడుకిలోల బరువు గల పెసర విత్తనాల కిట్లను అందజేయడం జరుగుతుందన్నారు.

స్కూల్ యూనిఫాంల అందజేత



రఘునాథపల్లి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన విద్యార్థులకు పాఠశాలల ప్రారంభానికి ముందే స్కూల్ యూనిఫాంలు రెడీ అయ్యాయని ఎంపీడీవో గార్లపాటి శ్రీనివాసులు అన్నారు. మండలంలోని 62 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 1,278 మంది బాలురు, 1,409 మంది బాలికలకు సంబంధించిన స్కూల్ యూనిఫాంలను నవభారతి మండల సమాఖ్య టైలరింగ్ హబ్ ద్వారా సకాలంలో కుట్టి మంగళవారం ఎంఈవో రఘునందన్ రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎం సారయ్య, సీసీలు రీనావతి, సంపత్, ఎల్లస్వామి, భాగ్యలక్ష్మి, ఉమాదేవి, సరోజన, జంపయ్య, ఎస్ఏ శివారెడ్డి, టైలరింగ్ సభ్యులు పాల్గొన్నారు.

పాస్‌బుక్ కోసం లక్షలో డిమాండ్

ప్రజాభవన్‌లో వృద్ధుడి ఫిర్యాదు



ప్రజాభవన్‌లో ఫిర్యాదు చేస్తున్న పోచయ్య

బచ్చన్నపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పట్టాదారు పాస్‌పుస్తకం కోసం గతంలో పనిచేసిన అధికారులు రూ.4లక్షలు లంచంగా అడిగారు.. నా వద్ద డబ్బులు లేకపోవడంతో నాఫైలు పక్కకు పడేశారు.. ప్రజా ప్రభుత్వంలోనైనా తనకు న్యాయం చేయాలి' అంటూ కొన్నె గ్రామానికి చెందిన వృద్ధుడు తప్పట్ల పోచయ్య మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఫిర్యాదు చేశాడు. రెండు సర్వే నంబర్లలో 4-26 ఎకరాల భూమి తనకు పట్టాకాకుండా చేశారంటూ వాపోయాడు. పాత పాస్‌బుక్‌లో తన భూమి ఉన్నా, తన గోడు ఏ అధికారి పట్టించుకోలేదన్నారు.



ఫీస్ కమిటీ సమావేశం నిర్వహిస్తున్న సీఐ శ్రీనివాస్‌రెడ్డి

సోదరభావంతో పండుగలు జరుపుకోవాలి

జనగామ రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి):ప్రతీ ఒక్కరు సోదరభావంతో పండుగలను జరుపుకోవాలని రఘునాథపల్లి సీఐ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం రఘునాథపల్లి, లింగాలగణపురం, చిల్పూర్ వివిధ మత పెద్దలతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ఇతర మతాలను గౌరవిస్తూ పండుగలను జరుపుకోవాలన్నారు. సమావేశంలో ఎస్సైలు నరేశ్ కుమార్, శ్రవణ్ కుమార్, మత పెద్దలు దస్తగిరి, భాష్మియా, రిజ్వాన్, యాకుబ్, సమీర్, అహ్మద్, రామ్మూర్తి, కేవీఎల్ఎన్‌రెడ్డి పాల్గొన్నారు.

వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా వెంకటేశ్వర్‌రావు



న్యూశాయంపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లా వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఎన్.వెంకటేశ్వర్‌రావు ఎన్నికయ్యారు. హనుమకొండ హంటర్‌రోడ్‌లోని సంఘం భవనంలో ఎన్నికలు జరిగాయి. సంఘంలో మొత్తం 2,396 ఓట్లు ఉండగా 1434 ఓట్లు పోలయ్యాయి. అధ్యక్ష పదవికి ఇద్దరు పోటీ పడగా, పేరాల మధుసూదన్‌రావుపై వెంకటేశ్వర్‌రావు 323 ఓట్లతో విజయం సాధించారు. ఉపాధ్యక్షులుగా పిన్నింటి బాలచందర్‌రావు, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, తక్కళ్లపల్లి శ్యాంసుందర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా కాకులమర్రి ప్రవీణ్‌కుమార్, కోశాధికారిగా సిద్ధూరి స్వామిరావు, సంయుక్త కార్యదర్శిగా పల్లెపాటి విద్యాసాగర్‌రావు, కార్యవర్గ సభ్యులుగా పుస్కూరి రఘుకుమార్, గండ్ర ప్రభాకర్‌రావు, తక్కళ్లపల్లి బలరామరావు, మార్తినేని రవీందర్‌రావు, చెన్నమనేని జయశ్రీ, గుజ్జ గోపాల్‌రావు, తక్కళ్లపల్లి అమృతరావు, గండ్ర గోపాల్‌రావు, లింగంపల్లి పాపారావు, పిన్నింటి వెంకటేశ్వర్‌రావు, జలగం రంజిత్ కుమార్, ఎన్నమనేని శ్రీనివాస్‌రావు ఎన్నికయ్యారు.

వైద్య శిబిరానికి అపూర్వ స్పందన



రఘునాథపల్లి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): కంచనపల్లిలో మంగళ వారం నిర్వహించిన మెగా వైద్య శిబిరంలో సుమారు 400 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి, తన్నీరు హరీష్ రావు పుట్టిన రోజు సందర్భంగా మల్లారెడ్డి నారాయణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ కందుకూరి ప్రభాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంను మాజీ సర్పంచ్ గవ్వాని విజయ నాగేశ్వరరావు ప్రారంభించారు. వివిధ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నానాజీ, ప్రభాకర్, గుండె జోసఫ్, పసుల ఏలియా, తిరుమల్ రెడ్డి, ప్యారపు రాములు, కడుదుల విష్ణు, సాంబరాజు, శ్రీనివాస్, రమేష్, రాజు, భాస్కర్, మనోజ్, శ్రీధర్ పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ రూరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): సీఎం విదేశీ విద్య ఉపకార వేతనాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి బి.విక్రమ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విదేశాల్లో విద్యాను అభ్యసించేందుకు మైనార్టీ విద్యార్థులు 35 సంవత్సరాలు కల్గిన వారు తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ. 5లక్షల లోపు ఉన్నవారు ఆధార్‌కార్డుతో పాటు కుల సర్టిఫికేట్‌తో www.telanganaepass.cgg.gov.in వైబ్‌సైట్‌లో జూన్ 30 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు కొరకు 99519 33034, 90596 79793 నంబర్లను సంప్రదించగలరని తెలిపారు.

ఐటీఐ శిక్షణ కొరకు...

ఐటీఐ శిక్షణ కొరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్న ఆలేరు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ హరికృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి పూర్తయిన విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్‌తో iti.telangana.gov.in వైబ్‌సైట్లో ఆన్‌లైన్ ద్వారా జూన్ 21లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాల కొరకు 98668 43920 నంబరును సంప్రదించగలరని తెలిపారు.

కలెక్టరేట్ ఎదుట సీపీఎం ధర్నా



కలెక్టరేట్ కార్యాలయం ముందు సీపీఎం నాయకుల ధర్నా

జనగామ రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): గుడిసెవాసులను వేధిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం లింగాల ఘణపురం మండలం పటేల్‌గూడెంలో గుడిసెవాసులతో కలిసి సీపీఎం నాయకులు కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. కనకరెడ్డి మాట్లాడుతూ ఇండ్లు లేని నిరుపేదలు పటేల్‌గూడెం గ్రామ పరిధిలోని ప్రభుత్వం స్థలంలో గుడిసెలు వేసుకోని జీవనం కొనసాగించడం జరుగుతుందన్నారు. గుడిసెలను ఖాళీ చేయాలని రెవెన్యూ, పోలీసు అధికారులను వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి అధికారులపై చర్యలు తీసుకొని, గుడిసె వాసులకు మౌలిక వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సింగారపు మహేశ్, విజేందర్ పాల్గొన్నారు.

కొడవటూరులో వేలం వాయిదా

బచ్చన్నపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రమైన కొడవటూరు సిద్దులగుట్టలో మంగళవారం జరిగిన వేలం పాటలు కొబ్బరిముక్కల సేకరణ మినహా మిగతావన్నీ వాయిదా పడ్డాయి. టెంకాయలు, పూజా సామగ్రి అమ్ముకోవటం, లడ్డు, పులిహోర ఫలహారం తయారు చేయుట, తలనీలాలు పోగు చేసుకొనుట, కొబ్బరి ముక్కలు పోగు చేసుకునేందుకు వేలం పాటలు నిర్వహించారు. కొబ్బరి ముక్కల సేకరణను రూ.1.70 లక్షలకు అమరేశ్వర్ సొంతం చేసుకున్నారు. దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటలక్ష్మీ, ఈవో చిందం వంశీ, చైర్మన్ ఆముదాల మల్లారెడ్డి, ఆలయ సిబ్బంది, డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

డబ్బులు అడిగితే ఫిర్యాదు చేయండి

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాల కోసం ఎవరైనా డబ్బులు అడిగితే ఫిర్యాదు చేయాలని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలిపాక సతీష్ కోరారు. మంగళవారం ఆయన స్టేషన్ ఘన్‌పూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ రైతు రుణ మాఫీ, ఇందిరమ్మ ఇళ్లు, కొత్తగా రేషన్‌కార్డులు, పింఛన్‌లు తదితర పథకాలు ఇప్పిస్తామని నాయకులు గానీ, దళారులు గానీ, ఇంకెవరైనా డబ్బులు అడిగితే ఎమ్మెల్యే లేదా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. ఇలాంటి పనుల వల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని, ఎవరూ ఒక్క రూపాయి కూడా ఇవ్వవద్దని కోరారు.

కొలాప్స్

(5వ పేజీ తరువాయి)

ట్రెజరీకి పంపాల్సి ఉంటుంది. సకాలంలో బిల్లులను సబ్మిట్ చేయకపోవడంతో నిధులు లాప్స్ అయినట్లు తెలుస్తోంది. మార్చి 31 తర్వాత ట్రెజరీకి బిల్లులు పంపగా ట్రెజరీ అధికారులు తిప్పి పంపించినట్లు సమాచారం. కాగా.. నిధు లు లాప్స్ అయిన అంశంపై కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా సైతం ఆగ్రహం వ్యక్తం చేయగా విద్యాశాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. కలెక్టర్ ఆదేశాలో వెనక్కి వెళ్లిన నిధుల కోసం విద్యాశాఖ అధికారులు ప్రభుత్వానికి లెటర్ పెట్టినట్లు పలువు రు చెబుతున్నారు. ప్రభుత్వం నుంచి రిలీజ్ ఆర్డర్ వస్తేనే ఫ్లడ్ డ్యామేజీ కింద చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులు విడుదల కానున్నాయి.

పశు సంవర్ధక శాఖపై చిన్నచూపు తగదు



కార్యక్రమంలో మాట్లాడుతున్న రవిందర్

చిలుపూర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం పశు సంవర్ధక శాఖపై చిన్నచూపు తగదని జీఎంపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవిందర్ అన్నారు. మంగళవారం కృష్ణాజీగూడెంలో నిర్వహించిన జీఎంపీఎస్ జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడుతూ, ప్రభుత్వం గొర్లమేకలతో పాటు, పాడి పరిశ్రమపై నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మోటే దేవేందర్, ప్రధాన కార్యదర్శి సాదం రమేష్, కన్నెబోయిన బాలరాజు, రమేష్, రాజబీరయ్య, మేకల మల్లేష్, చంద్రయ్య, బోళ్ళ రాజ్‌కుమార్, ప్రభాకర్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ బ్లాక్‌బెల్ట్ ప్రదానం



జఫర్‌గడ్, జూన్ 3(ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ కరాటే గ్రేడింగ్ పోటీల్లో జఫర్‌గడ్‌కు చెందిన ఠాకూర్ భగవాన్ సింగ్ అంతర్జాతీయ డాన్ బ్లాక్‌బెల్ట్ పురస్కారాన్ని అందుకున్నారు. హైద్రాబాద్ లోని గచ్చిబౌలిలో జపాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల బ్లాక్‌బెల్ట్ డాన్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. భగవాన్‌సింగ్ జేకేఏ 2వ డాన్ బ్లాక్‌బెల్ట్ సాధించారు. ఇండియా ప్రధాన కరాటే కోచ్ శిహాన్ ఆనంద్ రత్న సెన్సేయి, తెలంగాణ-ఏపీ రాష్ట్రాల ప్రధాన కోచ్ శిహాన్ రాపోలు సుదర్శన్ సెన్సేయి చేతుల మీదుగా పురస్కారాన్ని సోమవారం రాత్రి హైద్రాబాద్‌లో అందుకున్నాడు.

నందీష్‌కు రాష్ట్ర ప్రతిభా పురస్కారం



పాలకుర్తి, జూన్ 3(ఆంధ్రజ్యోతి) : టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన పాలకుర్తి విద్యార్థి ఈగ నందీష్‌కు రాష్ట్ర ప్రతిభా పురస్కారం దక్కింది. మంగళవారం హైదరాబాద్‌లో బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నాడు. మండల కేంద్రంలోని బీసీ సంక్షేమ బాలుర హాస్టల్‌లో నివాసం ఉండే నందీష్ స్థానిక సిద్ధార్థ ఉన్నత పాఠశాలలో టెన్త్‌లో 557 మార్కులు సాధించాడు. విద్యార్థికి ప్రోత్సాహకం మెమోంటోను అందచేశారు. బీసీ సంక్షేమ హాస్టల్ విద్యార్థి పురస్కారం అందుకోవడంపై బీసీ సంక్షేమ జిల్లా అధికారి రవీందర్ హర్షం వ్యక్తం చేశారు.

మండలి సభ్యుడి కలిసిన పృథ్వీ

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి అప్పిలేట్ అథారిటీ కమిటీ సభ్యుడు ప్రొఫెసర్ గాదెదయాకర్‌ను మంగళవారం జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గాదె పృథ్వీ మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నో పోరాటాల్లో ముందుండి నడిపించిన కేయూ మాజీ ప్రొఫెసర్ దయాకర్ లాంటి వారిని గుర్తించి కమిటీలో సభ్యుడిగా నియమించడం అభినందనీయమన్నారు.